ఉదయం ఎనిమిదిగంటలు కావస్తోంది.

లలితాంబ కూతుర్ని నిద్రలేపేందుకు అప్పటికి నాలుగయిదుసార్లు ప్రయత్నించి విఫలమయింది. కూతురు ఉష చేస్తున్న ఉద్యోగం ఆమెకెంతమాత్రం యిష్టం లేదు.

పొద్దస్తమానం క్రైమ్ రిపోర్టింగంటూ పోలీస్‌స్టేషన్స్ చుట్టూ, కోర్టులచుట్టూ తిరిగి సాయంత్రానికి న్యూస్ తయారుచేసి రెసిడెంట్ ఎడిటర్‌కి అందించి ఇంటికొచ్చేసరికి ఒక్కోసారి అర్ధరాత్రవుతుంటుంది.

అలా అని ఖండితంగా ఉద్యోగం మానేయమని చెప్పలేని నిస్సహాయత.

కొడుకు చనిపోయిన దగ్గర్నుంచి భర్త మంచంమీంచి లేవటంలేదు. ఉన్న ఆస్థి అంతా ఊడ్చుకుపోయింది. చివరకు ఆడపిల్లే ఇంటికి దిక్కయింది. అలాంటి పరిస్థితుల్లో కూతురు చేసే ఉద్యోగం బాగోదని మాన్పిస్తే జరుగుబాటు?

మానవ సంబంధాలన్నీ ఆర్థికపరమైన సంబంధాలే అనటానికి తమ కుటుంబమే ఓ ఉదాహరణ... ఆమె నిట్టూరుస్తూ వంటగదికేసి సాగిపోయింది.

సరిగ్గా 8-30 అవుతోంది.

లలితాంబ బెడ్‌కాఫీ తీసుకుని ఉష గదివేపు వస్తుండగా ఒక్కసారే నిశ్శబ్దం బ్రద్దలయింది ప్రక్కింట్లో.

నలుగురయిదుగురు ఆడవాళ్ళు చేరితే సౌండ్ పెరిగిపోతుందే తప్ప తగ్గటం లేదు.

ప్రశాంతత భగ్నం కావడంతో ఉష సడన్‌గా మేల్కొంది.

చికాకుగా కళ్ళు సున్నితంగా రాసుకుంటూ తల్లి అందించిన కాఫీ అందుకుంటూ ఏమిటన్నట్లు కనుబొమల్ని ఎగురవేసింది.

“ఏమో తెలియదు” అందామె చెదిరిన కూతురు నుదుటిమీద జుత్తును ప్రేమగా పైకి నెడుతూ.

ఉష నైటీని సరిచేసుకుని ఆసక్తిగా బయటకు నడిచింది. అప్పటికే పక్కింటి ముందు దాదాపు పాతికమంది దాకా పోగయ్యారు.

ఉషలో ఆసక్తి రేట్టింపయింది.

తల్లి వెనుకనుంచి పిలుస్తున్నా వినిపించుకోకుండా వడివడిగా పక్కింటికేసి సాగిపోయింది.

“ఉషా...ఉషా...ఉషా...” నిజంగా అందమయిన ఉషస్సు...ఉషోదయపు అద్వితీయ అందం ఆమెలో ఆణువణువునా ప్రతిఫలిస్తుంటుంది. అలా అని తెలుపు... ఎర్రెర్రగా ఎరుపూ కాదు... చక్కని నలుపు. చక్కని చామనచాయ నలుపు... అయితే ఏం?

గుండ్రటి పెద్ద పెద్ద కళ్ళు---

వాటిని ఆక్రమించే అందమయిన కనురెప్పలు... ఆ కనురెప్పల అడుగున వెలుగును చిందించే చురుకైన కళ్ళు ఏమాత్రం ఆసక్తిని కలిగించే సంఘటనకయినా, వ్యక్తికయినా చలించిపోయే కళ్ళు. వంపులు తిరిగిన నెలవంకలాంటి కనుబొమ్మలు. బుల్లి పెదవులు... ఆ

పెదవులపై ఎప్పుడు కనిపించే మెరుపు.

నవ్వితే... చిన్నపాటి నవ్వుకయినా చొట్టలు పడే చెక్కిళ్ళు... ఐదుడగుల ఆరంగుళాల ఎత్తులో అందగత్తేనా కాదా అన్న సందిగ్దంలో ముందు పడేసి... ఆ తర్వాత పరిశీలన మీద పసందయిన ఆకర్షణ ఆమెలో ఇమిడివుందనిపించే 37:24:36 స్ట్రక్చర్.

కేవలం తెల్లగా వుంటేనే ఆడాళ్ళు అందంగా వుంటారన్న భ్రమలో వున్న భ్రాంతిపరుల్ని సయితం అచ్చెరువందించే అద్వితీయమైన చార్మింగ్ ఆమె ప్రత్యేకత.

ఆమె ఎప్పుడు....ఎక్కడ? ఎలా? ఎవరిముందు స్పందిస్తుందో అని ఆశగా.

ఎంతోమంది ఎదురుచూట్టం ఎప్పటినుంచో ఎందరిలోనో కొనసాగుతున్న నిరీక్షణ.

మాట్లాడే తన పెదవుల వేపు - పరామర్శించే తన కళ్ళవేపు చూడకుండా చూసినా... ఆ తదుపరి తమ చూపుల్ని బరువయిన ఎదవేపు మరలించి ఆ తదుపరి తన సన్నని 24వేపు మరలించేవారంటే ఆమెకు చిరాకు...కోపం...

అందుకే ఆమె అప్పుడప్పుడు తనివితీరా స్నానం చేసేప్పుడు తనువువేపు చూసుకుని, ఆ అద్భుతమైన వంపులు తనపరం కావటం తనకో శాపమేమో అనుకుంటుంది.

అదిగో అలాంటిదే ఉష...ఆ ఉష... తమతో ఎక్కువసేపు మాట్లాడితే ఎంత బావుండనుకునే స్వప్నలోక విహారులు ఇప్పటికే ఎంతో మంది.

ఆమె నవ్వితే...

ఆమె కళ్ళు నవ్వుతాయి.

ఆమె చెక్కిళ్ళు నవ్వుతాయి.

ఆమె పెదవులు నవ్వుతాయి.

ఎదుటి మనిషిలోని చిరాకును చిరుకోపాన్ని తుదముట్టించే అద్భుతమైన శక్తి ఆమె ప్రత్యేకమైన నవ్వుకుంది.

అయితే ఏ కొద్దిమంది అదృష్టవంతులో ఆమె నవ్వును చూడగలిగితే-ఎక్కువమంది ఆమెలో గంభీరతని చూశారు.

అతి తక్కువమందే ఆమెలో చిరాకును, చిరుకోపాన్ని చూశారు.

అయితే ఆమెలోని అందమైన సిగ్గును ఇంతవరకు ఎవరూ చూడక పోవటం వలనే ఎవరూ అంత ఇదిగా ఆమె దగ్గర కాలేదు.

ఆమె ఎవరికీ అర్థం కాదు. కాని అర్థ మైనట్లే అనిపిస్తుంది.

ఆమె ఇప్పుడు చొరవగా పక్కింటి సమూహంలోకి చొరబడి పోయింది.

“ఏమైంది? ఎందుకిలా ఏడుస్తున్నారు...?” చురుకయిన ఆమె సన్నని కంఠం అక్కడ అలుముకున్న గందరగోళాన్ని ఛేదించింది.

ఎవరూ ఏం చెప్పలేకపోయారు.

తిరిగి అదే ప్రశ్నను రెట్టించింది.

సమాధానం చెప్పాలనుకున్న ఇద్దరు యువకులు ఆమెవేపు చూస్తూ తమ చూపుల్ని ఆమె నైటీ చాటున పారేసుకున్నారు.

మూడోసారి స్వరం పెంచి అడిగింది.

"సుందరి తన చిట్‌ఫండ్ కంపెనీ బోర్డ్ తిప్పేసిందట, ఛిట్స్ కట్టినవాళ్ళు చిరు మొత్తాలు చెట్టెక్కిపోయాయి..." ఓ మధ్య వయస్కురాలంది ముక్కు ఎగబీలుస్తూ.

ఉదయాన్నే ఉత్రూతలూగించే సెన్సేషనల్ న్యూస్...? ఆమెలోని వృత్తి పరమైన ఉద్వేగం ఉరకలు వేసింది. పూర్తి వివరాల్లోకి వెళ్ళిపోయింది.

వాళ్ళు చెబుతున్న ప్రతిమాట ఆమె పోటోగ్రాఫిక్ మెదడులో నిక్షిప్తం అయిపోతున్నాయ్.

కేవలం సుందరే అనుకుంది ఉష. కాని అనన్యసామాన్యమైన అండదండలామెకున్నాయని ఉషలోని ఉరుకులు పెట్టే చైతన్యానికి తెలియదు.

ఒక్కొక్కరు తెలిసో తెలియకో వేసే చిన్న అడుగు మూలంగానే చిరుతపులుల్లాంటి ప్రమాదకరమైన వ్యక్తులు బయటకొస్తుంటారు.

0 0 0

నూనూగు మీసాల యువకుడు..... నిండు యౌవ్వనంలోకి అడుగిడిన ఆ యువకుడు..... ఎత్తయిన జైలు గోడలవేపు చూస్తూ మెయిన్ వేపు కదిలాడు.

కనీసం ఒక్కసారన్నా చిరునవ్వుకు అర్థం చెప్పకుండా-

తెలుసుకోకుండా బ్రతికిన ఉక్కు ముక్కులాంటి ఉదయ్ గేట్ కేసి వడివడిగా నడుస్తున్నాడు.

జేబులు కత్తిరించేవాడి దగ్గర్నుంచి, మనిషి ప్రాణాన్ని చిటికెలో హరించే నరరూప రాక్షసులవరకూ ఆ జైల్లో వుంటారు.

గుంటనక్కలు--

గుడ్లగూబలు--

తోడేళ్ళు--

కట్లపాములు...

ఇలాంటి ప్రమాదకరమైన వ్యక్తుల మధ్య చేయని తప్పును రుజువు చేసుకోలేక--

బ్రతికేందుకు మరో దారి లేక డబ్బుండి తప్పుచేసిన వాడి తప్పుల్ని నెత్తిన వేసుకునో, కొందరు మేకల్లా, ఆవుల్లా వారి మధ్యకు మనిషిలోని నేరప్రవృత్తిని క్రమేపీ తగ్గిస్తూ నేరస్తుడ్ని సంస్కరించటం అనేది జైలు అన్నపదానికి నిర్వచనం అనేది పదకోశ ప్రబంధాల్లోనే సమాధి అయిపోయింది.

అతను నడుస్తున్నాడు. ఆలోచిస్తూ గతాన్ని నెమరు వేసుకుంటూ.

అప్పటికే సాయంచీకట్లు ముసురుకున్నాయి. జైలు గేటు దాటగానే తన తండ్రి, తల్లి, అక్కా వస్తారని అతను ఎంతో ఆశగా ఎదురు చూశాడు.

మరో వారంలో జైలు నుంచి తనకు విముక్తి లభించబోతుందని తెల్సిన క్షణం నుంచి అతని ఆలోచనలన్నీ అమ్మా, నాన్న, అక్కలమీదే.

క్షణమొక యుగంగా అతని కాలం హరించుకు పోతుంటే-తాను తన కుటుంబంతో గడపబోయే మధుర క్షణాలను మంత్రించుకుంటూ బయటకొచ్చాడు, గేటు బయట నిర్జనం, నిశ్శబ్దం.

తన గేటులోంచి బయటకు అడుగు వేయగానే టపీమని మూసుకున్న జైలు తలుపు.

ఎవరో వస్తారనుకున్నాడు. ఎవరూ లేరక్కడ.

అంతలో అటుగా వచ్చిన బస్ గేటుముందు నించున్న గంభీరాకారాన్ని చూసి ఓ క్షణం ఆగింది. కాని అప్పటికే తన కుటుంబం నిరాదరణకు నిరసనగా మిగిలిపోయిన ఉదయ్ బస్ ఎక్కే ప్రయత్నం చేయలేదు, కసిగా కాలినడకన బయలుదేరాడు.

ఆ నిశ్శబ్ద నీరవంలో అతని అడుగుల చప్పుడు చిన్న చిన్న జంతువులకు అదురు పుట్టిస్తుండటంతో అవి భీతావహంగా చెల్లాచెదురై పోతున్నాయి.

ఆ నిశ్శబ్దం... ఆ నీరవం.... ఏవీ...అవేవీ అతని అలోచనల్నిగని, అడుగుల వేగాన్నిగాని ఆపలేకపోయాయి.

"ఏరా బచ్చానాకొడకా...వేలెడంత లేవు! చలాగ్గా మర్డర్ చేసేశావే. నిన్ను ఓ కంట కనిపెట్టి వుండాలి" జవాన్ వ్యంగ్యంగా అంటుంటే తనేం చేశాడో? తనకే తెలీని ఉక్రోషం.

ఏలూరు-శనివారపేటలో ఉన్న సర్టిఫైడ్ స్కూల్లో క్లాసులయి పోగానే అంబికా దర్బారు బత్తి తయారీ..సన్నని పొడవయిన పుల్లలకు సెంటెడ్ గ్రీజ్ అతుకుతున్నప్పుడు తను కళ్ళవెంట తనకు తెలీకుండా రాలిపడిన కన్నీళ్ళు - కన్నీళ్ళతో తడిసి తయారయిన అగరబత్తీల వాసన ఎలా వుంటుంది?

తనకోసం అమ్మా,నాన్న, అక్క ఎంత ఏడుస్తున్నారో?

వచ్చే వారం నాన్న తనకోసం రావచ్చు, వచ్చే నెల స్కూల్ సెలవల్లో నాన్న తన తరుపున స్కూల్ సూపరింటెండెంట్కి హామీ ఇచ్చి తన్ను ఇంటికి తీసుకెళ్ళవచ్చు.

కాళ్ళక్రింది ఓ ఎండు కట్టె టప్పున విరిగిన శబ్దం. జ్ఞాపకాల పొరల్ని మూసేసిన వర్తమానం పదేళ్ళుగా జైలు గోడలమధ్య అతననుభవించిన ఒంటరితనం అతన్నిప్పుడు వెక్కిరిస్తోంది.

నన్ను మాత్రమే ఆశ్రయించిన ఓ నిర్భాగ్యుడా నీకంటూ ఎవరూ లేరా? చెళ్ళున వీపున ఒంటరితనపు కొరడాదెబ్బ.

అప్పుడు త్రుళ్ళిపడ్డాడు. నలువేపులా చూశాడు.

శ్మశానం, బూడిద కుప్పలు, జ్ఞాపిక స్థూపాలు, సగం కాలిన కట్టెలు, సమాధుల

స్తబ్దత, కీచురాళ్ళ రొద  బలహీన మనస్కుడ్ని భయభ్రాంతుల్ని చేసే భ్రాంతి.

దూరంగా సగం కాలిన శవాన్ని పొర్లించి కాలుస్తున్న కాటికాపరి.  అతన్ని ఆవరించుకున్న ఒంటరితనం. కాలిన శవాల మధ్య ఒంటరితనం అతనిది. బ్రతికున్న
మనుష్యుల మధ్య ఒంటరితనం తనది.

ఉండుండి ఒక్కసారి నవ్వాడు పెద్దగా..... పెటిల్లున......  పెనుభూతంలా.....

కాటికాపరి ఉలిక్కి పడ్డాడు. ఊపిరి తీసుకోవడం మానేశాడు. జైలు గోడల కర్కశత్వంతో రాటుదేలిన రాతిశరీరం.

ఉదయ్ మరల నవ్వాడు. ఈసారి చిన్నగా భయపడవద్దంటూ భరోసాగా నవ్వాడు. బదులు వచ్చేలోపే బరువుగా సాగిపోయాడు ముందుకి.  నాన్న వచ్చి ప్రతిసారీ ఈసారికాదు మరోసారి తీసుకెళ్తానని చెప్పటం----

శ్మశానం నుంచి ఫర్లాంగు దూరం వచ్చాడు.  మరికొంత ముందుకెళ్ళాక రోడ్డు ప్రక్క కనిపించిందో టీ బంక్.

రోడ్డుకి అయిదారు గజాల దూరంలో పూరిపాక. దానిలో ఓ పెట్రోమాక్స్ లైట్.

నలుగురయిదుగురు అటూ యిటూ కదులుతూ అందులో వున్న చెక్కబల్లల ముందు కూర్చుని ఖాకీదుస్తుల శవాకారాలు.

అక్కడ ఒకింతసేపు ఆగాలనిపించింది ఆగాడు. ఆగి ఆ పాకముందు వేసున్న నులకమంచంమీద కూర్చున్నాడు. ఆకలిగా వుందనిపించింది. ఎదురుగా వున్న డ్రయివర్ కోడికాలును ఆబగా పళ్ళ మధ్య యిరికించి లాగుతుంటే జేబులో చేయి పెట్టాడు. జైల్లో పడ్డ శ్రమకు ప్రతిరూపం కరెన్సీ కాగితాల దొంతర.